క్లుప్తంగా

ఆటో డ్రైవర్ల పొట్టకొట్టిన కూటమి ప్రభుత్వం



ఏఓకి వినతి పత్రం అందిస్తున్న విశ్వేశ్వరరెడ్డి తదితరులు

సీటీఆర్ఐ: మహిళలు కోసం ఉచిత బస్సుపెట్టి కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లు పొట్టకొట్టారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ఆటోడ్రైవర్లతో కలిసి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఏఓ సుజాతకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఒక ఆటోకి నెలకి రూ.10 వేల చొప్పున భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఆశించదగ్గ విషయమే కానీ దానివల్ల నష్టపోతున్న ఆటో కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ధర్నా కార్యక్రమానికి ఆటో కార్మికుల ఆటోలు తీసుకురాకుండా పోలీసులు నగరంలో సెక్షన్ 30 అమలులో ఉందని భయపెట్టారన్నారు. అంతేకాకుండా ఆటోలను సీజ్ చేస్తామని పోలీసులు హెచ్చరించడం ఎంత వరకు సబబు అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు జేటీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ దూడల నాగేశ్వరరావు మృతి

కడియం: దుళ్ల మాజీ సర్పంచ్ దూడల నాగేశ్వరరావు(66) మృతి చెందారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన చికిత్స పొందుతూ కన్నుమూశారు. 1996–2001లో దుళ్ల గ్రామ సర్పంచ్‌గా సేవలందించారు. ఆయన భార్య రత్నం కూడా 2005–11లో గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. కాగా మంగళవారం గ్రామంలోని ఆయన వ్యవసాయక్షేత్రంలో అంత్యక్రియలు ముగిశాయి. పెద్ద ఎత్తున వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

త్వరితగతిన రివర్ ఫ్రంట్ పనులు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న పురందేశ్వరి, ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి రివర్ ఫ్రంట్ పనులు త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోనికి తీసుకునిరావాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధికారులు, కాంట్రాక్టరుకు సూచించారు. మంగళవారం గోదావరి గట్టున రూ.8 కోట్లతో పూలే విగ్రహం దగ్గర నుంచి చేపట్టిన గోదావరి రివర్ ఫ్రంట్ పనులను కూటమి నాయకులు, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. రివర్ ఫ్రంట్ నమూనాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

శరవేగంగా నగర అభివృద్ధి

రాజమహేంద్రవరం సిటీ : ప్రజల అవసరాలకు అనుగుణంగా నగరంలో అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డివిజన్ల వారీగా ఆరా తీశారు. ఈ సమీక్షలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎస్ఈ(ఇన్‌చార్జి) రీటా, ఈఈలు మాధవి, మదర్సా అలీ ఇతర అధికారులు, పాల్గొన్నారు.

బంగారం, వెండి వస్తువుల చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంటిలో ఎవరూ లేని సమయంలో 44.5గ్రాముల బంగారం, 37తులాల వెండి వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని శాటిలైట్‌సిటీ ఇందిరమ్మ కాలనీకి చెందిన కణజాల దుర్గాభవాని మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. శాటిలైట్‌సిటి ఇందిరమ్మకాలనీలో దుర్గభవానీ తల్లిదండ్రులు, ఇద్దరు చెల్లెళ్లతో నివాసం ఉంటోంది. సోమవారం తెల్లవారు జామున దుర్గాభవానీ పెద్ద చెల్లి పెట్రోలు బంకులో పని చేసేందుకు వెళ్లగా, తల్లిదండ్రులు కూలి పనికి వెళ్లారు. దుర్గాభవానీ కూడా ఉదయం 9 గంటల సమయంలో ప్రైవేటు జాబ్‌కు వెళ్లింది.చిన్న చెల్లి 11 గంటలకు చర్చికి వెళ్లింది. అయితే మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పెద్దచెల్లి ఇంటికి వచ్చి తలుపు తీసుకుని వెళ్లగా వెనుక తలుపు తీసి ఉండి, మంచంపై వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. విషయం తెలిసి ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని 44.5 గ్రాముల బంగారపు వస్తువులు, 37 తులాల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని దుర్గాభవాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై కె.రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కోటగుమ్మం సెంటర్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించిన గుడూరి శ్రీనివాస్,రౌతు సూర్య ప్రకాశరావు, మేడపాటి షర్మిలారెడ్డి



కోటగుమ్మం సెంటర్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించిన మార్గాని భరత్‌రామ్



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విజయసారథి, రాజు తదితరులు



ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రజల గుండెల్లో రాజశేఖరుడు

- పథకాల సారథి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి
- రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ భరత్‌రామ్
- వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు ఘన నివాళులు
- పలు సెంటర్లలో సేవా కార్యక్రమాలు



కొంతమూరు గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులు అర్పించి, మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి,చిత్రంలో మార్గాని భరత్‌రామ్



బొమ్మూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రాజమహేంద్రవరం సిటీ: దివంగత మహా నేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు మరువలేనివని అందుకే ఆయన ప్రజల గుండెల్లో మహోన్నతమైన చెరగని ముద్రవేసుకున్నారని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాళులు అర్పించారు. మంగళవారం రాజమహేంద్రవరంలో మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో సిటీ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ చిత్రపటానికి రామచంద్రారెడ్డి, మార్గాని భరత్ రామ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ భరత్‌రామ్‌మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్,మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, రౌతు సూర్యప్రకాష రావు, తలారి వెంకట్రావు, ఉభయ రాష్ట్రాల బిసి జెఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు,నగర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుత్తుల మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో దేవుడిగా వైఎస్సార్

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్సార్ అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి ప్రజలు గుండెల్లో దేవుడిగా నిలిచిపోయారని మాజీ మంత్రి, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం కొంతమూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీసెల్ అధికార ప్రతినిధి మీర్జా మాలా అలీ ఆధ్వర్యంలో వైఎస్సార్ 16వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, పార్టీనాయకులు చెరుకూరి సత్యనారాయణ, షేక్‌నన్ను,పిల్లాశ్రీను,గాబ్రియేలు, ఆనెంశ్రీను,లాయర్‌శ్రీను,టీటిప్రసాద్,పిన్నమరెడ్డి సూర్యచంద్రం,షేక్‌బాజీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పథకాలు మరువలేనివి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలు మరువలేనివని వైఎస్సార్ సీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు రెవ. విజయసారధి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రెవ.రాజు కొనియాడారు. మంగళవారం కొంతమూరులో జిల్లా క్రిస్టియన్ మైనార్టీసెల్ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. రూరల్ నియోజకవర్గ ప్రెసిడెంట్ బ్రదర్ ఇమ్మానియేల్, సుధాకర్, చిట్టిబాబు, వీసీపాల్ పాల్గొన్నారు.



జేగురుపాడులో వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ తదితరులు



వేమగిరిలో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణు తదితరులు



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న ఆకుల వీర్రాజు

బొమ్మూరులో...

బొమ్మూరులోని వైఎస్సార్ సెంటర్‌లో రాష్ట్రకాపుకార్పొరేషన్ మాజీ డైరెక్టర్,పార్టీ జిల్లా కార్యదర్శి ముద్దాల అను ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.వైఎస్సార్ విగ్రహానికి ఆయన, పార్టీ జిల్లా కార్యదర్శి యెనుముల త్యాగరాజు, జిల్లా దివ్యాంగులసెల్ అధ్యక్షుడు ముత్యాలపోసికుమార్. తోడేటిరాజా,సద్గుణరామారెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటిపల్లిరవీంద్ర,కాకులపాటి కుమార్ తదితరులు పాల్గొన్నారు. మోరంపూడి జంక్షన్‌లో పార్టీనాయకులు చీరారాజు ఆధ్వర్యంలోను వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

రాజమహేంద్రవరం సిటీ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నారని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పార్టీ నగర అధ్యక్షుడు మార్గాని భరత్ రామ్ అన్నారు. మంగళవారం డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా నగరంలో కోటగుమ్మం సెంటర్, లాలాచెరువు సెంటర్, క్వారీ సెంటర్ తదితర చోట్ల వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్వారీ సెంటర్‌లో అజ్జరపు వాసు ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుత్తుల మురళీధర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, నగర మహిళా అధ్యక్షురాలు పోలు విజయలక్ష్మి, పార్లమెంట్ అధికార ప్రతినిధి కానుబోయిన సాగర్, పార్టీ నాయకులు దాసి వెంకటరావు, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్, చోడిశెట్టి సత్యవేణి, బిల్డర్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ స్ఫూర్తి శాశ్వతం

ప్రజలకు మంచి చేయాలని వైఎస్సార్ ఆశయ స్ఫూర్తి శాశ్వతమైందని రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. తిలక్ రోడ్డులోని పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ మాజీ అధ్యక్షులు తోట రామకృష్ణ, పెద్దేవం గ్రామ సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.

కోటగుమ్మం జంక్షన్‌లో..

వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్పర్సన్, మేడపాటి షర్మిలా రెడ్డిలతో కలసి నివాళులర్పించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా రాజమహేంద్రవరంలోని కోటగుమ్మం జంక్షన్లో నెలకొల్పిన వెఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.

వైఎస్ సేవలు చిరస్మరణీయం

ధవళేశ్వరం: దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు చిరస్మరణీయమని ధవళేశ్వరం వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ సెంటర్, బ్యారేజ్ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్(శివ), గరగ శ్రీనివాస రావు, గోలి దేవకుమార్, షబ్బర్ బాషా, ముత్యాల పోసికుమార్, ముద్దాల అను, చొల్లంగి సత్యగిరి, పేర్ల బాసి, ఆశోక్, రమేష్, మస్తాన్ బేగ్, వెంకటరమణ, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌కు ఘన నివాళి

కడియం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు.గ్రామాల్లోని ఆయన విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. వైఎస్ సేవలను గుర్తు చేసుకున్నారు. వేమగిరిలో హైవే జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బడుగు ప్రశాంత కుమార్, విప్పర్తి ఫణి, వెలుగుబంటి అచ్యుతరామ్, రాజా రమేష్, గుబ్బల నాగార్జున, నరాల శ్రీను, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కడియపులంకలోని హైవేపై వైఎస్సార్ విగ్రహానికి ఉమ్మడి జిల్లా డీసీసీబీ మాజీ అధ్యక్షులు ఆకుల వీర్రాజు పుష్పాంజలి ఘటించారు. మండల కేంద్రమైన కడియంలో వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ముఖ్యఅతిథిగా హాజరై పుష్పాంజలి ఘటించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. జేగురుపాడులో పార్టీ మండల అధ్యక్షులు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ఆధ్వర్యంలోను, దోసాలమ్మకాలనీలో మండల వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ ఈలి గోపాలరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ నివాళులర్పించారు.

వార్డు సచివాలయాల పనితీరుపై పర్యవేక్షణ

నోడల్ అధికారులతో కలెక్టర్ ప్రశాంతి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో వార్డు సచివాలయాల పనితీరును నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి సూచించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటన సమయంలో చెత్త సేకరణతోపాటు రోడ్లు, డ్రైన్లు, తాగునీటిపై వచ్చే సమస్యలపైన దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ఐవీఆర్ఎస్ కాల్స్‌లో వచ్చు ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని పేర్కొన్నారు. అలాగే డ్రైన్లు ఆక్రమణలకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత నోడల్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని ఇందు కోసం స్థల యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కాలువలు, కుంటలలో ఆయిల్ బాల్స్ వేసి, రసాయనాలు పిచికారీ చేయించాలన్నారు. అవసరమైతే డ్రోన్ సాయంతో స్ప్రేయింగ్ చేయించాలని సూచించారు. స్థానిక రెసిడెన్షియల్ సొసైటీ సభ్యులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలన్నారు. నగర పాలక సంస్థపై ప్రజల్లో సంతృప్తి శాతం పెరిగేలా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఇతర నోడల్ అధికారులు, పాల్గొన్నారు.

అహంకారాన్ని అధిగమించడానికే తపస్సు

- శతావధాని తాతా సందీపశర్మ
- సదనంలో సరస్వతీసపర్యా మహోత్సవాలు



తాతా సందీపశర్మను సత్కరిస్తున్న నిర్వాహకులు

సీటీఆర్ఐ: మానవుడు తనలోని పశుప్రవృత్తినీ, అహంకారాన్ని అధిగమించడానికే నిరంతరం కృషి చేయాలని, అర్జునుడు పాశుపతాస్త్రం కోసం చేసిన తపస్సు అంతరార్థం ఇదేనని ×శతావధాన శరచ్చంద్ర×× తాతా సందీపశర్మ అన్నారు. గోదావరి గట్టున ఉన్న ఆంధ్రయువతీ సంస్కృత కళాశాలలో కొనసాగుతున్న 54వ సరస్వతీ సపర్యామహోత్సవాల్లో భాగంగా, ఆయన మంగళవారం కిరాతార్జునీయం అనే అంశంపై ప్రసంగించారు. వ్యాసభారతంలోని వనపర్వం, నన్నయ భట్టారకుని ఆంధ్రభారతంలోని అరణ్యపర్వం, శ్రీనాథుని హరవిలాసం, భారవి కిరాతార్జునీయం తదితర గ్రంథాల నుంచి పలు శ్లోకాలను, పద్యాలను ఉదహరిస్తూ సందీపశర్మ కిరాతార్జునీయం అంశాన్ని వివరించారు. సదనం విద్యాసంస్థల కరస్పాండెంట్ కొట్ల కనకేష్, కళాశాల ప్రిన్సిపాల్ వి.అన్నపూర్ణ, అధ్యాపకులు సత్యశ్రీష తదితరులు వక్త సందీపశర్మను సత్కరించారు. బుధవారం సాహితీవేత్త వారణాసి సుబ్రహ్మణ్యం 'రామాయణంలోని మానవ సంబంధాలు' అనే అంశంపై ప్రసంగిస్తారు.

ఐదుగురి అరెస్టు



మద్యం తాగుతున్న వారి నుంచి వివరాలు సేకరిస్తున్న ధవళేశ్వరం పోలీసులు

ధవళేశ్వరం: బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ధవళేశ్వరం సీఐ టి.గణేష్ తెలిపారు. మంగళవారం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వెనుక వైపు ఉన్న బహిరంగ ప్రదేశంలో డ్రోన్ కెమెరా ఉపయోగించి మద్యం సేవిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గణేష్ హెచ్చరించారు.

పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సేవలు విజయవంతం



వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శేషారావు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని పోస్టల్ డివిజన్‌లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకింగ్ సదుపాయాలను ప్రతి ఇంటికి చేరువ చేయడంలో సిబ్బంది అంకితభావంతో పనిచేసి విజయవంతం చేశారని డివిజనల్ సూపరింటెండెంట్ కోట శేషారావు పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ 8వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలో శేషారావు మాట్లాడుతూ, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ అనేది కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ పరిధిలో ఉండే తపాలా శాఖకు సంబంధించిన ఈ అనుబంధ సంస్థ అని అన్నారు. సెప్టెంబర్ ఒకటి నాటికి ఏడేళ్లు పూర్తి చేసుకుందన్నారు. బ్యాంకింగ్ కనెక్టివిటీ గ్రామీణ డిజిటల్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఈ వ్యవస్థను ప్రారంభించారన్నారు. తపాలా డివిజన్‌లో 3.5 లక్షల ఖాతాదారుల మైలు రాయిని దాటిందని, వారిలో 51 శాతం కంటే ఎక్కువ మంది మహిళా ఖాతాదారులు ఉన్నారన్నారు. పోస్టల్ డివిజన్ అధికార పరిధిలోని 375 పోస్టాఫీసుల ద్వారా ఈ సేవలను అందిస్తోందన్నారు. నగర పరిధిలోనే 50 వేల కంటే ఎక్కువ మంది ఖాతాదారులు ఉన్నారని, గ్రామీణ, పట్టణ లబ్ధిదారుల ఇంటింటికీ ప్రత్యక్ష నగదు బదిలీ ప్రయోజనాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, జాతీయ ఉపాధి హామీ పథకం, దీపం–2, గ్యాస్ సబ్సిడీలు ఇతర పథకాల లబ్ధిదారులు చాలా మంది ఈ సేవలను వినియోగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఎం.రాజేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పథకం గడువు ముగిసినా నగదు అందలేదు

- ఐసీడీఎస్ సీడీపీవో గౌరికి విన్నవించిన రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్



ఐసీడీఎస్ సీడీపీవో గౌరీతో మాట్లాడుతున్న యానాపు యేసు

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వం 2005లో కొత్త బాలికా సంరక్షణ పథకం కింద ఇచ్చిన ఎల్ఐసీ బాండ్లు గడువు ముగిసినప్పటికీ నగదు అందలేదని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు రాజానగరం ఐసీడీఎస్ సీడీపీవో గౌరీకి విన్నవించారు. మంగళవారం సీడీపీవో గౌరి కాతేరు గ్రామంలోని అంగనవాడీ సెంటర్–2ను సందర్శించి, సెంటర్ పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా యానాపు యేసు సీడీపీవో గౌరీని కలిసి కొత్త బాలికా సంరక్షణ పథకం నగదు విషయంపై మాట్లాడారు. 2005 అప్పటి ప్రభుత్వం ఒక ఆడపిల్లకు రూ.లక్ష, ఇద్దరు ఆడపిల్లలకు రూ.60వేలు డిపాజిట్ చేసి ఎల్ఐసీ బాండ్లను ఇచ్చారని, 18 సంవత్సరాలు దాటిన తరువాత నగదు వస్తుందని తెలిపారన్నారు. కానీ బాండ్లు మెచ్యూరిటీ అయినప్పటికీ నగదు రాలేదని, చాలా మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి మెచ్యూరిటీ అయిన బాండ్లకు నగదు ఇప్పించాలని యానాపు యేసు కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సీడీపీవో గౌరీ తెలిపారు. అంగనవాడీ సూపర్‌వైజర్ సింహాచలం, కార్యకర్త సరస్వతి, హెల్పర్ పూర్ణిమ, బిజేపీ నాయకులు బలగం కిరణ్, కండెల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మోరంపూడి విద్యుత్ లైట్ల పనులు



ఫ్లైఓవర్‌పై లైట్లు ఏర్పాటు చేస్తున్న

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి ఫ్లైఓవర్‌పై విద్యుత్ లైట్ల పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. మోరంపూడి ఫ్లైఓవర్ ను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు విద్యుత్‌లైట్లు, సర్వీసు రోడ్లు వేయించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ నిరసన తెలపడంతోపాటు, నేషనల్ హైవే పీడీకి వినతిపత్రం అందించారు. విద్యుత్‌లైట్లు లేకపోవడంతో ఫ్లైఓవర్ పై ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నేషనల్ హైవే అధికారులు స్పందించి మోరంపూడి ఫ్లైఓవర్‌పై విద్యుత్ లైట్లు పనులను ప్రారంభించారు. ఈనేపథ్యంలో హుకుంపేట నుంచి లాలాచెరువు వైపు వెళ్ల రహదారిని మూసివేశారు. ఫ్లైఓవర్‌పై సుమారు 60లైట్లు వరకు ఏర్పాటు చేయనున్నారు. నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో విద్యుత్ లైట్లు పనులు పూర్తికానున్నాయి. దీంతో వాహనచోదకులు ఇక్కట్లు తీరనున్నాయి.

ఏటిగట్టు పరిశీలన

కడియం: బుర్రిలంక పరిధిలోని ఎస్సీ సొసైటీ భూముల ఎగువన ఉన్న ఏటి గట్టును ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ మంగళవారం పరిశీలించారు. వరద ఉధృతి కారణంగా గట్టు కోతకు గురై ఎస్సీ సొసైటీ భూములు ముంపు బారిన పడుతున్నాయని స్థానిక రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.